నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | SANGAREDDY

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 10: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని శభాష్‌గూడెంలో ఆదిజాంబవ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

- వడగండ్ల వానతో కష్టం నేలపాలు
- ఎకరాకు రూ.20 వేల పరిహారం అందించాలి
- ప్రభుత్వానికి హరీశ్‌రావు విజ్ఞప్తి
- పంట నష్టం నివేదిక ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్, వ్యవసాయ అధికారులకు విజ్ఞప్తి

సిద్దిపేట, ఏప్రిల్ 10: సిద్దిపేట నియోజకవర్గంలో బుధవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. వడగండ్ల వానకు రైతుల ఆరుగాలం కష్టం నేల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.20వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషిచేస్తానని హరీశ్‌రావు మనో ధైర్యాన్ని నింపారు.

పల్లెపల్లెనా వాల్ రైటింగ్

వరంగల్ సభకు విస్తృత ప్రచారం

- ప్రత్యేక బృందాలతో గ్రామాలు, పట్టణాల్లో హోరెత్తిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి మండలంలో అతికిస్తున్న వాల్‌రైటింగ్

చేర్యాల, ఏప్రిల్ 10: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జనగామ నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీనికోసం ఆయన చేర్యాల ప్రాంతంలో పల్లెపల్లెనా.. వాడవాడనా భారీగా వాల్‌రైటింగ్ చేయిస్తున్నారు. తెలంగాణ ఉద్యమం నాటి రోజులు గుర్తుచేస్తూ వారం రోజులుగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగామలో ప్రత్యేకమైన కొటేషన్లతో కూడిన వాల్‌రైటింగ్ చేయిస్తున్నారు. వాల్‌రైటింగ్స్ ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. 'మన ఇంటి పార్టీ–బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ' ఆహ్వాన పత్రం పేరిట ప్రత్యేకంగా బ్రోచర్లు తయారుచేసి వాటిని పంపిణీ చేయిస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే పల్లా తనదైన శైలిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి బృందానికి ఒక ఇన్‌చార్జిని నియమించారు. ప్రతి గ్రామంలో 15వరకు వాల్ రైటింగ్స్ చేయిస్తున్నారు. 54గ్రామాల్లో ఇప్పటికే 500కు పైగా గోడలపై ఎల్కతుర్తి సభ విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌రైటింగ్స్ పూర్తిచేయించారు. వాల్‌రైటింగ్‌లు పూర్తికాగానే గ్రామాల్లో జెండాల గద్దెల నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో మండలాల వారీగా సన్నాహాక సమావేశాలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పూర్తిచేశారు. సభకు వచ్చే పార్టీ శ్రేణులతో పాటు అభిమానులకు రూట్‌మ్యాప్ ఇవ్వడంతో పాటు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను ఎంగేజ్ చేసుకున్నారు. సభకు వచ్చే ప్రతి 25 మందికి ఒక్క ఇన్‌చార్జిని నియమిస్తున్నారు. సభకు వచ్చినవారి వివరాలను సదరు ఇన్‌చార్జి ప్రత్యేకంగా నోటు పుస్తకంలో రాసుకోవడంతో పాటు సభకు వచ్చినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరుకునే వరకు సదరు ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానాలు చేశారు.

సంగారెడ్డిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న చింతా ప్రభాకర్, నాయకులు

బీఆర్ఎస్ సభకు భారీగా తరలిరావాలి

- బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఏప్రిల్ 10: ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లానుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభతో బీజేపీ, కాంగ్రెస్‌కు నిద్ర పట్టడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, సీఎం రేవంత్ స్వల్పకాలంలో ప్రజాభిమానాన్ని కోల్పోయారని అన్నారు. తెలంగాణకు మళ్లీ మంచిరోజులు రావాలంటే కేసీఆర్ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని గుర్తుచేశారు. సభకు గ్రామ, మండల, పట్టణ స్థాయి నాయకులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరి రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహులు, నాయకులు విజయేందర్‌రెడ్డి, రాజేందర్, చక్రపాణి, మాజీ జడ్పీటీసీలు కొండల్‌రెడ్డి, మనోహర్ గౌడ్, డా.శ్రీహరి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు

- మద్దూరు మండలంలో తారాస్థాయికి చేరిన విభేదాలు
- సోషల్ మీడియా వేదికగా ఒక వర్గంపై మరో వర్గం దూషిస్తూ పోస్టులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 10: కొన్నిరోజులుగా మద్దూరు మండల కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరుకున్నాయి. కాంగ్రెస్‌లో నాయకులు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరూ బాహాటంగానే విమర్శలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన వివిధ కార్యక్రమాలు అంతర్గత కలహాలతో అభాసుపాలవుతున్నాయి. పార్టీ కార్యక్రమాల సమాచారాన్ని తమకు ఇవ్వడం లేదని ఓ వర్గం నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్‌లోని ఓ ముఖ్య నాయకుడు ఇతర పార్టీల నాయకులతో సన్నిహితంగా ఉండడంపై సదరు నాయకుడిని మరో నాయకుడు నిలదీయగా అతన్ని బహిరంగంగా కార్యకర్తల ముందు దూషించినట్లు సమాచారం. కాంగ్రెస్ సంవిధాన్ యాత్ర ప్రారంభానికి ముందు మద్దూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఓ వర్గం నాయకులు మరో వర్గంపై ఘాటుగా విమర్శలు చేసుకున్నారు. దీనికితోడు ఇటీవల ఓ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తే గ్రామంలోని తమకు సమాచారం ఇవ్వలేదని, ఇరువురి ముఖ్య నాయకులను దూషిస్తూ ఆగ్రామానికి చెందిన ఓ కార్యకర్త వాట్సాప్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశంగామారింది. దీనిపై ఆ గ్రామానికి చెందిన ఇరువురు కార్యకర్తలపై ఓ ముఖ్య నాయకుడు పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తాజాగా గురువారం సంవిధాన్ యాత్రలో తనను స్టేజీ మీదికి ఎందుకు పిలువలేదని ఓ నాయకుడు కాంగ్రెస్ ముఖ్య నాయకుడిపై దాడికి యత్నించారు. ఇరువురి మధ్య కొంత తోపులాట జరిగింది. ఇలాంటి సంఘటనలు కాంగ్రెస్‌లో ఇటీవల కాలంలో వరుసగా చోటు చేసుకోవడంపై కాంగ్రెస్ నాయకులు గందరగోళానికి గురవుతున్నారు.

ఆదర్శంగా నిలిచిన అదనపు కలెక్టర్

- అంగన్‌వాడీ కేంద్రంలో కుమారుడి పేరు నమోదు

బాబు గ్రోత్ మానిటరింగ్ రిపోర్టును అదనపు కలెక్టర్‌కు అందజేస్తున్న ఇందిర, బాలలక్ష్మి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 10: సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదర్శంగా నిలిచారు. అదనపు కలెక్టర్ తన కుమారుడిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. గురువారం కొండపాక మధిర గ్రామం శెలంపు అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ బాలలక్ష్మి పేరు నమోదు చేశారు. సూపర్‌వైజర్ ఇందిరా ఈ మేరకు బాబు గ్రోత్ మానిటరింగ్ రిపోర్టు, బాలామృతం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం

- ముస్త్యాలలో పిడుగుపాటుకు ఆవు మృతి

ఆకునూరులో వడగండ్ల వానకు తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకున్న రైతులు

చేర్యాల, ఏప్రిల్ 10: మండలంలోని ఆకునూరు, ముస్త్యాల, రాంపూర్ గ్రామాల్లో గురువారం వడగండ్ల వాన కురవడంతో 200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గురువారం వేకువజామున అరగంట పాటు చిన్నపాటిగా కురిసిన వడగండ్ల వానతో చేతికివచ్చిన వడ్లు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకునూరులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలోని వడ్లు తడిసిపోయాయి. రైతులు ఉదయాన్నే కేంద్రం వద్దకు వెళ్లి వడ్లను ఆరబోసుకున్నారు. ముస్త్యాలలో రైతు కేసిరెడ్డి సురేందర్ రెడ్డికి చెందిన లక్షన్నర రూపాయల విలువైన జెర్సీ అవు పిడుగుపాటుతో మృతిచెందింది. గ్రామ మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి విషయాన్ని తీసుకుపోవడంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రైతు కేసిరెడ్డి సురేందర్‌రెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డితో ఫోన్‌లో పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వడగండ్ల వానకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు తాను కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని ఎమ్మెల్యే పల్లా ఆదేశించారు.

వట్‌పల్లిలో ఛలో వరంగల్ గోడపత్రికను అతికిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

కేసీఆర్ చాణక్యంతోనే తెలంగాణ సాకారం

- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి, ఏప్రిల్ 10: అనేక త్యాగాలు, శాంతియుత పోరాటం, కేసీఆర్ చాణక్యంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం అయ్యిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. గురువారం వట్‌పల్లిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి గోడకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమం కోసం ఒక రాజకీయ పార్టీ ఏర్పడడం దేశంలోనే తొలిసారని, బీఆర్ఎస్‌లో సభ్యులుగా ఉన్నందుకు మనమందరం గర్వపడాలన్నారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. రేవంత్ అసమర్థ పాలనతో అన్నివర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, అశోక్ గౌడ్, నర్సింలు, బస్వరాజు, బుద్ధిరెడ్డి, దీప్లానాయక్, సంగమేశ్వర్, ప్రభాకర్, శేఖర్, మధు, ప్రకాశ్, సుభాష్, మారుతి, మహేందర్, బాపురావు, నరేందర్ రెడ్డి, వీరారెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

హామీలు గాలికొదిలేసిన కాంగ్రెస్

బీఆర్ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి: జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్ లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 10: ఆరు గ్యారెంటీలు, అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆరోపించారు. గురువారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, సాధించిన తెలంగాణను అన్నిరంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇమేజ్‌ను దెబ్బతిస్తున్నదని, అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, రైతు బీమా పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని ధ్వజమెత్తారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి 5వేలకు పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి పండుగలా భావించి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు,అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ, పీఎసీఎస్ చైర్మన్ మచ్చేందర్, నాయకులు గుండప్ప, విజయ్‌కుమార్, రవికిరణ్, యాకూబ్, భాస్కర్, మోహిజొద్దీన్, నర్సింలుగౌడ్, మోహన్, అబ్దుల్లా, మిథున్‌రాజ్, గణేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీలో డిజిటల్ పేమెంట్స్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 10: సిద్దిపేట నుంచి జేబీఎస్‌కు వెళ్లే 10 డీలక్స్ బసుల్లో ఈ–టిమ్స్ డిజిటల్ పేమెంట్స్ మిషన్స్ ప్రవేశపెట్టామని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు గురువారం తెలిపారు. ప్రయాణికులు గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా టిక్కెట్లను పొంది ఎక్కడి నుంచి ఎక్కడికైనా సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చని సూచించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- వేల ఎకరాల్లో పంట నష్టం
- ఒక్క నంగునూరు మండలంలో 3869 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా
- నేలకొరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు
- నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి: అన్నదాతలు

సిద్దిపేట అర్బన్: వెంకటాపూర్‌లో దెబ్బతిన్న వరిపంట

మద్దూరు: నర్సాయపల్లిలో వడగండ్లకు నేలరాలిన వడ్లు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చెల్కలపల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్/నంగునూరు, ఏప్రిల్ 10: సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం వేకువజామున కురిసిన వడగండ్ల వర్షం రైతులకు కడగండ్లను మిగిల్చింది. అకాల వర్షానికి పెద్ద ఎత్తున పంటలు నష్టపోయాయి. నంగునూరు, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్ మండలాల్లో అకాల వర్షానికి భారీగా పంటలు దెబ్బతిన్నాయి. నంగునూరు మండలంలోని పాలమాకుల, రాజగోపాల్‌పేట, మైసంపల్లి, ముండ్రాయి, నర్మెట, వెంకటాపూర్, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, రాంపూర్, మగ్ధూంపూర్, అంక్షాపూర్, సిద్దన్నపేట, జేపీ తండా, బద్దిపడగ గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. భారీ వృక్షాలు కూలడంతో కొన్ని గ్రామాల్లో పాక్షికంగా ఇండ్లు సైతం దెబ్బతిన్నాయి. పంట చేతికందే సమయానికి వడగండ్ల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. నంగునూరు మండల వ్యాప్తంగా అకాల వడగండ్ల వర్షానికి సుమారు 3,869 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో పాలమాకులలో 1,010 ఎకరాలు, ముండ్రాయి 602 ఎకరాలు, ఖానాపూర్ 310, వెంకటాపూర్ 320, కోనాయిపల్లి 150, తిమ్మాయిపల్లి 102, రాజగోపాల్‌పేట 520, మైసంపల్లి 300, నర్మెట గ్రామంలో 280 ఎకరాల పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

సిద్దిపేట జిల్లా మైసంపల్లిలో భారీ వడగండ్లు


మద్దూరు: నర్సాయపల్లిలో దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతులు

పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల పంట పొలాలను మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం ఉదయం పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. నంగునూరు మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో వడగండ్ల వానతో రైతులను తీవ్ర నష్టం జరిగిందని, ఎకరాకు రూ. 20 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, ఏడీఏ పద్మక, మండల వ్యవసాయ అధికారి గీత, ఏఈవోలు, ఉద్యానవన అధికారులు పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు.

మద్దూరు మండలంలో

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 10: మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో గురువారం తెల్లవారుజామున 4గంటలకు సుమారు గంట పాటు వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల వర్షానికి వరి పంట నేలపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో సుమారు 100 ఎకరాలకుపైగా వరి పంటకు నష్టం జరిగింది. పంటలు దెబ్బతిని నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

చిన్నకోడూరు మండలంలో తీవ్ర నష్టం

చిన్నకోడూరు, ఏప్రిల్ 10: వడగండ్ల వానకు చిన్నకోడూరు మండలంలో వరి, మొక్కజొన్న, కీరదోస, మిర్చి, మామిడి తోటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. మండల కేంద్రమైన చిన్నకోడూరు, ఇబ్రహీంనగర్, మెట్‌పల్లి, సెలంద్రీ, ఎల్లమ్మజాలు, ఎల్లాయ్‌పల్లి, చెల్కలపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం, మాజీ వైస్ ఎంపీపీ పాపాయ్య, మాజీ సర్పంచ్‌లు శంకర్, మహేందర్, నాయకులు కార్తీక్, వ్యవసాయ అధికారులు, ఏఈవోలు గురువారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని 9 గ్రామాల్లో 1230మంది రైతులకు చెందిన 2110 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

చేర్యాల మండలంలో...

చేర్యాల, ఏప్రిల్ 10: అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాల్లో వేకువజామున వడగండ్ల వాన కురిసింది. కమలాయపల్లిలో 55 ఎకరాల్లో, అర్జునపట్లలో 10 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

హద్నూర్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో గాలివానకు విరిగి రోడ్డుపై పడిన చెట్టు

సంగారెడ్డి జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం

మనూరు, ఏప్రిల్ 10: సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుని వర్షం కురిసింది. వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దోపూర్ గ్రామ శివారులో పిడుగుపడి రైతు బోజిరెడ్డి గేదె మృతి చెందింది.

నిజాంపేట మండలంలో...

నిజాంపేట్, ఏప్రిల్ 10: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్‌తో పాటు నాగదార్, బాచెపల్లి, రాంరెడ్డిపేట్, పలు గ్రామాల్లో గురువారం వడగండ్ల వాన కురిసింది. పలుచోట్ల ఈదురుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి. నిజాంపేట్‌లో పలువురు రేకుల ఇండ్లు, కార్పెంటర్ షాపుపై, బాచేపల్లిలోని మహాత్మాజోతిరావు పూలే పాఠశాలపై పైకప్పులు రేకులి ఎగిరిపోయాయి. పలు పంటలకు నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న కూరగాయల పంటలు

జహీరాబాద్, ఏప్రిల్ 10 : జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో జహీరాబాద్–బీదర్, అల్లాదుర్గం–మెటల్‌కుంట తదితర ప్రధాన రహదారులకు ఇరువైపులా పలుచోట్ల చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. పలు గ్రామాల్లో ఇండ్లపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి నేలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మామిడి కాయలు నేలపాలయ్యాయి. కూరగాయలు, జొన్న, పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది.

నాగల్‌గిద్ద మండలంలో..

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 10: సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలో గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. పలు గ్రామాల్లో ఇండ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. జొన్న రైతులకు నష్టం వాటిల్లింది.

పిడుగుపాటుకు విద్యార్థి మృతి

సదాశివపేట/కొండాపూర్: సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ శివారులో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు విద్యార్థి మృతిచెందాడు. కొండాపూర్ మండలలంగంగారం గ్రామానికి చెందిన సంతోష్, అన్వేష్ సదాశివపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఐటీఐ చదువుతున్నారు. గురువారం సాయంత్రం కళాశాల నుంచి తిరిగి గంగారం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో భారీ వర్షం పడడంతో చెట్టుకిందకు వెళ్లారు. చెట్టుపై పిడుగు పడడంతో సంతోష్(17) అక్కడికక్కడే మృతిచెందాడు. అన్వేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు.

'ఖేడ్'లో ఈదురుగాలుల వర్షం

నారాయణఖేడ్, ఏప్రిల్ 10: నారాయణఖేడ్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో పట్టణంలోని రాయిపల్లి రోడ్డులో గల ఓ రెస్టారెంట్ పైకప్పు పెంకులు పూర్తిగా ఎగిరిపోగా ఆ సమయంలో రెస్టారెంట్‌లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టణంలోని మార్వాడీ గల్లీలో వర్షపునీరు వీధుల గుండా ప్రవహిస్తూ ఇండ్లల్లోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. చాప్టా(కె)లో ఈదురు గాలుల కారణంగా ఓ ఇంటి పైకప్పు రేకులు లేచిపోగా రెండు విద్యుత్ స్థంభ